క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, వైట్‌గోల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్ల మరమ్మతులు, వైర్లకు తగులుతున్న చెట్ల తొలగింపు కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందన్నారు. ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో ఇబ్రహీంపట్నం టౌన్, ఎంబీఆర్‌నగర్, గురునానాక్, చర్లపటేల్‌గూడ, శేరిగూడ ఫీడర్లు, వైట్ గోల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆక్టోపస్, వైట్ గోల్డ్, సీతారాపేట, అంబేడ్కర్‌నగర్, నాయినంపల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

అయోధ్య అక్షితల ఊరేగింపు



అక్షితలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: మండలంలోని రావిచేడ్‌లో అయోధ్య రామమందిరం దివ్య అక్షితలను గురువారం గ్రామస్తులు ఊరేగింపు చేసి, ఇంటింటికీ పంపిణీ చేశారు. స్థానిక ఆలయంలో అక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ అక్షితలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ గోపాల్, నాయకులు విఠలయ్యగౌడ్, ప్రజాప్రతినిధులు, శ్రీరామ భక్తులు, హనుమాన్ భక్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి

మంచాల: మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య పేర్కొన్నారు. 50 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంచాల ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న మోహన్‌రెడ్డి తదితరులు

మంచాల: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నర్సింహ పాదుపు సంఘం ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల మరణించిన ఆ సంఘం సభ్యులు మైలారం విష్ణు, రాచకొండ అనంతచారి కుటుంబసభ్యులకు రూ.10వేల చొప్పున సాయం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి లింగం, పాలక వర్గ సభ్యులు పరమేశ్, రాజిరెడ్డి, అమరేందర్‌రెడ్డి, జంగయ్య అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో సంతృప్తి



విద్యార్థులకు డిక్షనరీలు అందిస్తున్న వెంకటేశ్వర్లుగుప్తా తదితరులు

కందుకూరు: సమాజ సేవలో ఆత్మసంతృప్తి ఉందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తా గురువారం నేదునూరులోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే పేద విద్యార్థులకు చేయూతనందించే దాతలు ముందుకు రావాలని కోరారు. వెంకటేశ్వర్లుగుప్తా మాట్లాడుతూ.. ప్రతి ఏడాది తన తండ్రి జనార్దన్‌గుప్తా జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో యాదయ్యగుప్తా, సత్యనారాయణగుప్తా, పాఠశాల యాజమాన్యం, హరీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మితో కళకళ

- బస్సుల రాకతో యాచారం ఆర్టీసీ బస్టాండ్‌కు శోభ
- ప్రతి బస్సు బస్టాండ్‌లోకి వచ్చేలా చూడాలి
- కొన్ని బస్సులు లోపలికి రావడం లేదని ఆందోళన
- మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి



యాచారం బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

యాచారం: సర్కార్ మహిళలకు 'మహాలక్ష్మి పథకం' అమలులో భాగంగా ఉచిత ప్రయాణం కల్పించడంతో యాచారం ఆర్టీసీ బస్టాండ్‌కు గ్రహణం వీడింది. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో 25 ఏళ్ల క్రితం బస్టాండ్‌ను నిర్మించారు. మొదట్లో బస్సులు రాకపోకలు సాఫీగా సాగినా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావడం మానేశారు. దాదాపు 15 ఏళ్ల పాటు యాచారం ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా నిరుపయోగంగా మారింది. బస్టాండ్‌ను కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు మార్చేందుకు పైరవీలే చేశారు. బస్టాండ్ ఆ సాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు.

మహిళలకు ఉచిత ప్రయాణంతో..

సర్కార్ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్టాండ్‌కు ప్రయాణికుల శోభ పట్టింది. అంబేడ్కర్ చౌరస్తాలో బస్సులు నిలపడంతో అక్కడ నిత్యం ట్రాఫిక్‌జాం అవుతుంది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు అంబేడ్కర్ చౌరస్తాలో ఆపకుండా రెండు రోజుల పాటు శ్రమించి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌కు కళ వచ్చినట్లయింది. కానీ, సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు మాత్రమే వచ్చిపోతున్నాయని, నల్గొండ జిల్లాకు చెందిన దేవరకొండ, మిర్యాలగూడ, కల్వకుర్తి, చండూర్ తదితర డిపోలకు చెందిన బస్సులు రావడం లేదు. చేయి ఎత్తినా డ్రైవర్లు ఆపడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.

సౌకర్యాలపై దృష్టి సారించాలి

బస్టాండ్‌లో సీసీ రోడ్డు లేక దుమ్ము, దూళి వస్తుంది. ప్రత్యేక పర్యవేక్షణ సిబ్బంది లేరు. బస్టాండ్ ఆవరణలో మొత్తం కంపచెట్లతో నిండిపోయింది. కనీసం శుభ్రత లేదు. తాగునీటి సౌకర్యాలు లేవు. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నా వాడుకలో లేకపోవడంతో అపరిశుభ్రంగా ఉన్నాయి. నిత్యం ఈ బస్టాండ్ నుంచి మూడు వేల మంది వరకు విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు మరమ్మతులు చేసి, శుభ్రత పాటిస్తే ప్రయాణికులకు ఏ ఇబ్బంది ఉండదని పలువురు అంటున్నారు.

దుమ్ము, ధూళి వస్తుంది..



యాచారం బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలతో దుమ్ము, దూళి వస్తుంది. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. దేవరకొండ డిపో బస్సులు బస్టాండ్‌లోకి రావడం లేదు. బీఎన్‌రెడ్డిలో దేవరకొండ బస్సులు ఎక్కితే యాచారంలో స్టాప్ లేదని అంటున్నారు. అన్ని డిపోలకు చెందిన బస్సులు వచ్చిపోయేలా చూడాలి.

– గోగికార్ రమేశ్, ప్రయాణికుడు, నందివనపర్తి

అధికారులు శ్రద్ధ పెట్టాలి



ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలి. నిత్యం సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలి. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలు మరమ్మతులు చేయించాలి. బస్టాండ్ ఆవరణ అంతా శుభ్రంగా ఉంచాలి. అంబేడ్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తీరింది.

– ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ యాచారం

ఉన్నతాధికారులకు లేఖ రాస్తా



యాచారం ఆర్టీసీ బస్టాండ్‌ను మరమ్మతులు చేసేలా కావాల్సిన నిధుల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాస్తా. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి బస్సు బస్టాండ్‌లోకి వచ్చిపోయేలా ఆయా డిపోల మేనేజర్లకు లేఖలు రాస్తా. మరుగుదొడ్లు, మూత్రశాలలు మరమ్మతులు చేయిస్తాం. ఎవరైనా దాతలు ముందుకు వస్తే ఎంతో మంచిది.

– వెంకటనర్సప్ప, డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

మైసిగండి ఆలయ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



తలకొండపల్లి: కేక్‌కట్ చేస్తున్న రేణురెడ్డి, నేతలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచిన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మైసిగండి మైసమ్మను దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి, అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు హన్మానాయక్ , వేనుగోపాల్, భాస్కర్‌రెడ్డి, యాట నర్సింహ, బీచ్యానాయక్, యాదగిరిరెడ్డి, నరేశ్‌నాయక్, జాహంగీర్ అలీ ఉన్నారు.

గట్టుఇప్పలపల్లిలో కేక్‌కట్ చేసిన రేణురెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె రేణురెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రేణురెడ్డి పార్టీ నాయకులు కేక్‌కట్ చేశారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, ప్రయాణీకులకు స్వీట్లు, పండ్లు పంచారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, సీనియర్ నాయకులు డేవిడ్, మైసయ్య, కార్యకర్తలు, నాయకులుపాల్గొన్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు ఎంపీపీ అనిత విజయ్, డీసీసీ అధికార ప్రతినిది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న సత్యం, జంగయ్య, కేశవులు

ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందన



శుభాకాంక్షలు తెలుపుతున్న రవికుమార్

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీ స్థానాల కోసం నామినేషన్ వేసిన సందర్భంగా పార్టీ రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మస్న రవికుమార్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు శ్రీనివాస్, వరలక్ష్మీ, రమేశ్, అశోక్, నరేందర్, సత్యసాయి, రాజు, కర్నాటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్చి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ

తలకొండపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా చర్చి నిర్మాణం చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీఆర్‌పీఎస్(ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ డిమాండ్ చేశారు. క్రైస్తవులుగా మారి,అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్లు పొందుతున్న వారిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీకాంత్‌ను, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రంగారెడ్డిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. మండలంలోని గట్టుఇప్పలపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చర్చి నిర్మాణం చేపట్టారు. క్రైస్తవులుగా మారి అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్లు పొందుతున్న వారిని గుర్తించి బీసీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని తహసీల్దార్‌కు విన్నవించారు. చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, అసెంబ్లీ ఇన్‌చార్జి కృష్ణ, మల్లేశ్, రాజు, గణేశ్, మహేశ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ రాజశేఖర్

- సీఐ రాజశేఖర్

మాడ్గుల: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని మాడ్గుల సీఐ రాజశేఖర్ అన్నారు. మాడ్గుల మండ లం కలకొండలో గురువారం సర్వ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమా ల్లో సీఐ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లు, ఉచి త బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. అనంతరం హైదరాబాద్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్వ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమా ర్, అధ్యక్షురాలు మీనాక్షి, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు శంకర్, సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, ధనలక్ష్మి, సురేశ్, ఆర్టీసీ సిబ్బంది శ్రీరాములు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్యారంటీలు చేరువయ్యేలా కృషి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

హుడాకాంప్లెక్స్: సీపీఐ భగత్‌సింగ్‌నగర్ నూతన ఫేజ్–1 శంకర్‌నగర్ శాఖ సమావేశం గురువారం పార్టీ నేతలు నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి హాజరై సభ్యులకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో భగత్‌సింగ్‌నగర్ స్థాపించింది సీపీఐ పార్టీయేనని, ఎన్నో పోరాటాల ఫలితంగా ఆనాడు అజీజ్‌పాషా నాయకత్వంలో బస్తీని ఏర్పాటు చేశామన్నారు. నాటి నుంచి నేటి వరకు స్థానిక సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపైన కూడా కార్యకర్తలు దృష్టి సారించి అర్హులైన ప్రతి పేదవారికి అందేలా చూడాలన్నారు. సభ్యత్వాన్ని ఈ నెల 31 లోపు పూర్తి చేసి జిల్లా పార్టీకి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా శంకర్‌నగర్ శాఖ నూతన అధ్యక్షుడుగా జిల్లా కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ నరసింహ, ఇద్దిరీస్ బాయ్, శ్యామల, భాగ్యమ్మ, రమణమ్మ, ఖాదర్, కిషన్, యూసుఫ్, జోసెఫ్, లావణ్య పాల్గొన్నారు.

వాడవాడలా ఎన్టీఆర్‌కు ఘన నివాళి



తుర్కయంజాల్ : నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ, నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లులో దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటాన్ని ఉంచి కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదీలాల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ కోశాధికారి అర్థం నర్సింహ, మాజీ మార్కెట్ వైస్‌చైర్మన్ కండె సత్యం, నాయకులు శంకర్, కండె భాస్కర్, పెంటయ్య, పంచాక్షరి, వెంకటయ్య, శివయాదవ్, మల్లయ్య, బాబా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ : దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 9వ వర్ధంతి వేడుకలను తుర్కయంజాల్‌లో మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు రావుల వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, సంరెడ్డి భుజంగరెడ్డి, కొత్తకుర్మ శివ కుమార్, ఈసీ. శేఖర్ గౌడ్ , వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న యాదీలాల్



ఇబ్రహీంపట్నం: నివాళులర్పిస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 28వ జయంతిని ఇబ్రహీంపట్నంలో ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జక్క రాంరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చెరువు కట్టపై గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేద ప్రజల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన మేలును నేతలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు రవీందర్, అశోక్, అంజయ్య, రాందాస్‌గౌడ్, ప్రభాకర్, వెంకటేశ్‌గౌడ్, మల్లేష్, భిక్షపతి, ఇబ్రహీంలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కందుకూరు: టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అందుగుల సత్యనారాయణ, మదన్‌పాల్‌రెడ్డి, శ్రీశైలం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించాలి: వీహెచ్‌పీ

వనస్థలిపురం: జనవరి 22న అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్నం 2.30 గంటల వరకు సెలవు ప్రకటించిందని, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా సెలవు ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శాలివాహన పండరీనాథ్, సహ కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజలందరూ కుటుంబాలతో సహా ఆ మధుర ఘట్టాన్ని చూడాలని ఆశిస్తున్నారని, ప్రజల విశ్వాసాలను పరిగణలోకి తీసుకుని తెలంగాణ ప్రభుత్వం 22న సెలవు దినంగా ప్రకటించాలని వారు కోరారు. దేవాదాయ శాఖ ఆధీనంలోని ఆలయాల్లో ఉత్సవాలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించి దీపోత్సవం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని వీహెచ్‌పీ కోరుతోందని వారు అన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు



వికసిత్ భారత్ సంకల్పయాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తదితరులు

- కొత్తగూడలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కందుకూరు: భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం మండల పరిధిలోని కొత్తగూడలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలిపేలా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రకు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. దేశంలో పేదరిక నిర్మూలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తుండటం గర్వించదగ్గ విషయమన్నారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరాలన్న లక్ష్యంతో మోదీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌గౌడ్, వైద్య, వ్యవసాయ శాఖ అధికారులు రవీందర్, రాజు, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ వార్డు సభ్యులు హన్మంత్‌రెడ్డి, అజీజ్‌ఖాన్, నాయకులు సత్యనారాయణరెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అంజయ్య, కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, బస్వారెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

22న ఆర్‌కేపురంలో రథయాత్ర

దిల్‌సుఖ్‌నగర్: అయోధ్యలో భవ్య శ్రీరామ మందిర ప్రతిష్టాపన మహోత్సవం సందర్భంగా ఈనెల 22న ఆర్‌కేపురంలో అష్టలక్ష్మి ఆలయం, తత్వం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రామచంద్ర స్వామి రథయాత్ర నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.అష్టలక్ష్మి ఆలయం నుంచి ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే రథయాత్ర.. కాలనీల్లో కొనసాగి ఉదయం 9గంటలకు తిరిగి ఆలయానికి చేరుకుంటుందన్నారు.